సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 31 । మార్చి । 2024



భూసార కేంద్రానికి తాళం

సాగు భూముల్లో మట్టిని పరీక్షించి భూసార ఫలితాలు వెల్లడించాల్సిన కార్యాలయం సిబ్బంది లేక మూతపడింది. 8లో



..లక్ష్యం 90 మిలియన్ టన్నులు

రానున్న ఐదేళ్లలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 90 మిలియన్ టన్నులకు పెంచేలా సింగరేణి అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
38° / 22°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఎండ అధికంగా ఉంటుంది. గంటగంటకూ పెరుగుతూ మధ్యాహ్నానికి గరిష్ట స్థాయికి చేరుతుంది.



న్యూస్‌రీల్

పీహెచ్‌సీలో ఎన్‌క్వాస్ బృందం పరిశీలన



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న బృందం సభ్యుడు నారాయణ

చంద్రుగొండ : చంద్రుగొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ నాణ్యతా ప్రమాణాల(ఎన్‌క్వాస్) బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు నారాయణ, బాలకృష్ణ పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ల్యాబ్, ఆపరేషన్ గది, మందులు నిల్వ ఉంచే గదులను తనిఖీ చేశారు. వైద్య సేవలు అందించే తీరుతెన్నులపై డాక్టర్లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ బాలాజీ, డాక్టర్ స్పందన, డాక్టర్లు శృతి, వెంకట్‌ప్రకాష్, సీహెచ్‌ఓ నాగభూషణం, సిబ్బంది శోభ, లక్ష్మి, చంద్రకళ, ఎండీ ఇమాం, పద్మ పాల్గొన్నారు.

సమాజంలో గౌరవప్రదంగా జీవించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



మాట్లాడుతున్న జడ్జి భానుమతి

కొత్తగూడెంటౌన్: సమాజంలో ట్రాన్స్ జెండర్లు, సెక్స్ వర్కర్లు గౌరవప్రదంగా జీవించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెక్యూర్ ఎన్జీవో కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్లు, సెక్స్‌వర్కర్లకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ హక్కుల సంరక్షణకు చట్టాలు ఉన్నాయని, వివిధ కారణాల వల్ల ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లుగా మారిన మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్యూర్ ఎంజీవో ప్రాజెక్టు మేనేజర్ రాజేంద్రప్రసాద్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వి.పురుషోత్తమరావు, పి.నిరంజన్ రావు, అసిస్టెంట్ కౌన్సిల్ జ్యోతి విశ్వకర్మ, నాగ స్రవంతి, సీనియర్ న్యాయవాది మెండురాజ మల్లు తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో కాలేజీ !

కొత్తగూడెం వైద్య కళాశాలలో సమస్యల తిష్ట

- ఒకే క్యాంపస్‌లో కాలేజీ, ఆస్పత్రి ఉండాలనే నిబంధనకు నీళ్లు
- ఖమ్మం కాలేజీలో మార్పుల కోసం ప్రతిపాదనలు
- కొత్తగూడెంలో కనిపించని చొరవ



కొత్తగూడెం కేఎస్‌ఎంలో నిర్మించిన వైద్య కళాశాల

సాక్షిప్రతినిధి,భద్రాద్రికొత్తగూడెం: జిల్లాకు మంజూరైన మెడికల్ కాలేజీలో సమస్యలు తిష్ట వేశాయి. ఆరంభంలోనే ఈ సమస్యలకు ఔషధాలు ఉపయోగించి నయం చేయకపోతే భవిష్యత్‌లో ఈ కళాశాల సాధించాల్సిన లక్ష్యాలకు గండి పడే ప్రమాదం ఉంది.

ఇక్కడే ఎందుకిలా..

మెడికల్ కాలేజీ, విద్యార్థుల హాస్టళ్లు, బోధనాస్పత్రులు ఒకే క్యాంపస్‌లో ఉండాలనే నిబంధనను నేషనల్ మెడికల్ కమిషన్ దేశవ్యాప్తంగా అమలు చేస్తోంది. అయితే జిల్లాకు కేటాయించిన కళాశాల విషయంలో ప్రణాళిక లోపం కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. దీంతో కాలేజీ కేఎస్‌ఎం ప్రాంగణంలో ఉండగా, బోధనాస్పత్రులు కొత్తగూడెం, రామవరంలో కొనసాగుతున్నాయి. ఇలా అయితే రాబోయే రోజుల్లో ఈ కాలేజీలో చేరే విద్యార్థులు ఇబ్బంది పడే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఈ ఆస్పత్రిలో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడంలోనూ ఇక్కట్లు తప్పేలా లేవు.

ఖమ్మంలో మార్పు చేస్తూ ప్రతిపాదనలు..

కొత్తగూడెంలో మెడికల్ కాలేజీ ప్రారంభమైన మరుసటి సంవత్సరం ఖమ్మంలో వైద్య కళాశాలను ఏర్పాటు చేశారు. ఆరంభంలో జిల్లా ఆస్పత్రి సమీపంలో ఉన్న పాత కలెక్టరేట్‌లో మెడికల్ కాలేజీ కొనసాగించాలని నిర్ణయించారు. అయితే విద్యార్థులకు అవసరమైన హాస్టళ్లు, మెస్, హౌస్ సర్జన్ల హాస్టల్, ఫ్యాకల్టీ క్వార్టర్లు, భవిష్యత్‌లో ఆస్పత్రి విస్తరణ తదితర అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని మెడికల్ కాలేజీని ఒకే క్యాంపస్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు రఘునాథపాలెం మండలంలో 34 ఎకరాల స్థలాన్ని మెడికల్ కాలేజీకి కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

రామవరంలో స్థలం

మెడికల్ కాలేజీకి సంబంధించి కొత్తగూడెం సర్వజన ఆస్పత్రి ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఇక్కడ భవిష్యత్ అభివృద్ధికి ఆస్కారం లేదు. మెడికల్ కాలేజీ ఉన్న కేఎంఎస్ ప్రాంగణం చుట్టూ అటవీశాఖ భూములే ఉన్నాయి. మిగిలిన రామవరం మాతాశిశు ఆస్పత్రి ఒక్కటే విశాల ప్రాంగణంలో ఉంది. ఈ ఆస్పత్రి చుట్టూ అవసరమైనంత ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. మెడికల్ కాలేజీకి సంబంధించి భవిష్యత్‌లో ఎటువంటి విస్తరణ చేపట్టాలన్నా రామవరం ఒక్కటే అన్ని విధాలా అనుకూలంగా ఉంది. ఈ నేపథ్యంలో కొత్తగూడెం కాలేజీ భవనాల నిర్మాణం పూర్తి కానుందన ఖమ్మం మెడికల్ కాలేజీ తరహాలో నిర్ణయం తీసుకోవాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. అందులో భాగంగా మెడికల్ కాలేజీని రామవరానికి మార్చాలనే డిమాండ్ విద్యార్థులు, వైద్యులు, స్థానికుల నుంచి వస్తోంది. ఇలా మార్పు చేస్తే విద్యార్థులకు ఇక్కట్లు తొలగడంతో పాటు ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం కలుగుతుంది. అంతేకాకుండా పట్టణ అభివృద్ధికి మెడికల్ కాలేజీ చోదక శక్తిగా పని చేస్తుంది.

ఆగిన నిర్మాణం

కొత్తగూడెంలోని మెడికల్ కాలేజీ ప్రస్తుతం జిల్లాకు మంజూరైన నర్సింగ్ కాలేజీ భవనాల్లో కొనసాగుతోంది. దీని ముందే మెడికల్ కాలేజీ భవనాలు, హాస్టళ్లు, కామన్ మెస్, హౌస్ సర్జన్ హాస్టల్ భవన నిర్మాణ పనులు గతేడాది ప్రారంభమయ్యాయి. పిల్లర్ల వరకు వచ్చిన తర్వాత నిధుల కొరతతో పనులు మధ్యలోనే నిలిచిపోయయి. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఇదే క్యాంపస్‌లో సుమారు వెయ్యి పడకల సామర్థ్యంతో ఆస్పత్రి భవనాలు కూడా నిర్మిస్తామనే ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రస్తుతం కాలేజీకి ఎంపిక చేసిన స్థలం , దాని చుట్టూ ఉన్న ప్రాంతాలు అటవీ శాఖ, 1/70 చట్టం పరిధిలో ఉన్నాయి. ఫలితంగా భవిష్యత్‌లో ఇక్కడ కాలేజీ, హాస్టల్, ఆస్పత్రుల నిర్మాణం పూర్తయినా, వాటికి అనుబంధంగా ప్రైవేటు రంగం ద్వారా ఇక్కడ ఇతర సౌకర్యాలు వచ్చే అవకాశం లేని పరిస్థితి నెలకొంది.

శిక్షణకు ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అల ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల, పక్కన అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్, ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటుపై రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో పాల్గొన్న కలెక్టర్.. ఆ తర్వాత జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. శిక్షణకు హాజరయ్యే పీఓ, ఏపీఓలు తమ ఎపిక్ కార్డులు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ప్రతి శిక్షణా కేంద్రానికి ఇన్‌చార్జ్ అధికారులను నియమించామని తెలిపారు. వారంతా తమకు కేటాయించిన కేంద్రాలను తనిఖీ చేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్లు, ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు ఏప్రిల్ 23 లోగా ఫారం -12డీని రిటర్నింగ్ అధికారికి అందజేయాలని సూచించారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎన్నికల సూపరింటెండెంట్లు ధారా ప్రసాద్, రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

భద్రాచలంటౌన్: ఏప్రిల్ 2 నుంచి 4వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు సంబంధించి ఆరు విభాగాలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్ మిల్టన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల ను శనివారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలుగు, హిస్టరీ, ఎకనామిక్స్, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ విభాగాల్లోని విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భద్రయ్య, అధ్యాపకులు శ్యామ్, ప్రసాద్, కామేశ్వరరావు, శ్రీను, రాంబాబు, వేణుకృష్ణ, కల్పన పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

చివరి రోజు 62 మంది గైర్హాజరు



హాస్టల్ నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థి

కొత్తగూడెంఅర్బన్ : జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు శనివారం నాటి పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 62 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ ఎం. వెంకటేశ్వరాచారి తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 12,341 మందికి 12,289 మంది హాజరయ్యారని, 52 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రైవేటు విద్యార్థులు 58 మందికి 48 మంది పరీక్ష రాశారని, 10 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. తాను ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశానని, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది 27 కేంద్రాలు, జిల్లా పరిశీలకులు ఐదు సెంటర్లను పరిశీలించారని వివరించారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టిస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన





భారీగా హాజరైన భక్తులు (ఇన్‌సెట్) స్వామి వారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

నిత్యకల్యాణంలో 122 జంటలు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా స్వామివారి నిత్యకల్యాణ వేడుకలో 122 జంటలు పాల్గొనడం విశేషం.

కేంద్రియ విద్యాలయాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

ఖమ్మంరూరల్: కేంద్రియ విద్యాలయాల్లో 1వ తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు కేంద్రియ విద్యాలయాల సంఘటన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2024–25 సంవత్సరానికి గాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఏప్రిల్ 1న ఉదయం 10గంటలకు మొదలు కానుండగా, ఏప్రిల్ 15 సాయంత్రం 5గంటల వరకు అవకాశముంది. మార్చి 31 నాటికి ఆరేళ్ల వయస్సు నిండిన వారు దరఖాస్తుకు అర్హులని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇక 2నుండి ఆపై తరగతులకు మాత్రం ఆయా విద్యాలయాల్లో ఖాళీల ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నారు.

ఆదాయం బరాబర్!



- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రూ.227 కోట్ల రాబడి
- గతేడాదితో పోలిస్తే డాక్యుమెంట్లు తగ్గినా అదే ఆదాయం
- భారీగా ఫీజుల పెంపు.. అయినా నిరాశే
- ఖమ్మం కార్యాలయానికి అత్యధికంగా రూ.108 కోట్లు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా నిలిచే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు గత ఏడాదితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయం కాస్త పెరిగింది. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కొద్ది మేర తగ్గినప్పటికీ ఆదాయంలో వృద్ధి నమోదైంది. ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఈ సంవత్సరం 47,102 డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయగా.. రూ.227,34,80,000 ఆదాయం సమకూరింది. శనివారం అర్ధరాత్రి వరకు మరిన్ని డాక్యుమెంట్లు అప్‌డేట్ కానుండడంతో ఆదాయం ఇంకాస్త పెరుగుతుందని భావిస్తున్నారు.

అత్యధికంగా ఖమ్మం నుంచే...

ఉమ్మడి జిల్లాలో ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఖమ్మంరూరల్, కూసుమంచి, మధిర, సత్తుపల్లి, వైరా, కల్లూరు, కొత్తగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, ఇల్లెందులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి 47,102 డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయగా.. రూ.227,34,80,000 ఆదాయం వచ్చింది. ఇందులో స్టాంప్ డ్యూటీ రూపంగా రూ.169,60,79,000, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ కింద రూ.25,54,82,000, రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.32,19,19,000 నమోదైంది. అయితే, ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోనే అత్యధికంగా రూ.108.65 కోట్ల ఆదాయం సమకూరడం విశేషం. ఆ తర్వాత స్థానంలో కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి రూ.34.64 కోట్లు లభించగా.. అతి తక్కువగా భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి కేవలం రూ.4.09 లక్షల ఆదాయం నమోదైంది.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల సంఖ్య కొంత తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం 47,366 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరగగా రూ.226,42,90,989 ఆదాయం వచ్చింది. ఈసారి 47,102 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లే జరిగినా రూ.227,34,80,000 ఆదాయం నమోదైంది. ఆరు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికలు జరిగినా ఆ ప్రభావం ఆస్తుల క్రయవిక్రయాలపై పడలేదు. దీంతో గత ఏడాదితో పోలిస్తే కాస్త తక్కువ సంఖ్యలో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరగగా ఆదాయం కొద్దిమేర పెరిగింది. కాగా, శనివారం సాయంత్రం వరకు 47,102 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కాగా.. అర్ధరాత్రి వరకు డాక్యుమెంట్‌లను అప్‌డేట్ చేయాల్సి ఉండడంతో ఈ సంఖ్యతో పాటు ఆదాయం పెరుగుతుందనే అంచనాలో అధికారులు ఉన్నారు.

ఫీజులు పెరగడంతో..

ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజు, భూవిలువ, ఇతర పన్నులను పెంచింది. అందుకే డాక్యుమెంట్ల సంఖ్య తగ్గినా ఆదాయం మాత్రం పడిపోలేదు. 2014–15 ఏడాదిలో 51,554 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. అప్పుడు కేవలం రూ.59,61,83,523 లభించాయి. ఆతర్వాత ఏటా క్రమక్రమంగా పెరుగుతుండగా.. 2018–19 తర్వాత మరింత పైకి చేరడంతో ఈసారి ఆదాయం రూ.227కు కోట్లకు చేరింది.

తెలంగాణ ఆవిర్భావం నుంచి డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్, ఆదాయం ఇలా..

ఏడాది	డాక్యుమెంట్లు	ఆదాయం
2014-15	51,554	రూ.59,61,83,523
2015-16	76,930	రూ.71,39,46,038
2016-17	46,958	రూ.68,59,24,822
2017-18	50,128	రూ.86,26,79,470
2018-19	58,640	రూ.114,57,63,808
2019-20	67,207	రూ.131,87,28,260
2020-21	50,276	రూ.100,05,20,114
2021-22	57,570	రూ.206,68,18,974
2022-23	47,366	రూ.226,42,90,989
2023-24	47,102	రూ.227,34,80,000

మిగిలింది ఒక్క రోజే..

- ఉపాధి హామీలో 617 సీసీ రోడ్లు మంజూరు
- జిల్లాకు రూ.34.24 కోట్ల నిధులు కేటాయింపు
- ఇప్పటివరకు 450 రోడ్ల నిర్మాణాలు పూర్తి
- చివరలో అధికారుల హైరానా..



టేకులపల్లి మండలంలో ఉపాధిహామీ కింద నిర్మించిన సీసీ రోడ్డు

చుంచుపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్లను సీసీ రహదారులుగా మార్చడానికి ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు భారీగా నిధులు కేటాయించింది. దీంతో మారుమూల గ్రామాల్లోని రోడ్ల రూపురేఖలు మారుతున్నాయి. ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం ఏటా జనవరి, ఫిబ్రవరి నెలల్లో భారీగా పనులు మంజూరు చేసి వాటికి నిధులు కేటాయిస్తుంది. ఈ ఏడాది కూడా జిల్లాలో సీసీ రోడ్ల కోసం కేంద్రం ఈ పథకం కింద రూ.34.24 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులన్నింటినీ మార్చి చివరిలోపు పూర్తి చేయాలని గడువు విధించింది. గతంలో సీసీ రోడ్ల పనులకు సమయం తక్కువ ఉండటం, గడువు లోపు కాంట్రాక్టర్లు పనులను చేపట్టకపోవడంతో చాలా వరకు రద్దయ్యేవి. ఈ సారి కొంత ముందుగానే పనులు మంజూరు కావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ల సహకారంతో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు వెంటనే ప్రతిపాదనలు రూపొందించి గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల పనులు ప్రారంభించారు. గతంలో ఎదుర్కొన్న సమస్యలు పునరావృతం కాకుండా ప్రతీరోజూ నిర్మాణ పనులు పరిశీలిస్తున్నారు. అయితే ఆదివారంతో గడువు ముగుస్తుండగా ఇంకా పలు చోట్ల పనులు పూర్తి కాలేదు. జిల్లాలో మొత్తం ఐదు నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో నియోజకవర్గానికి సీసీ రోడ్ల పనులకు గానూ రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల చొప్పున కేటాయించారు. ప్రతి గ్రామంలో రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల చొప్పున దూరాన్ని బట్టి రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

450 రోడ్ల పనులు పూర్తి..

2023 – 24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 617 సీసీ రోడ్డు నిర్మాణ పనులు మంజూరు చేసింది. ఇందులో 602 పనులను ప్రారంభించగా.. ఇప్పటివరకు 450 పూర్తయ్యాయి. 152 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగతా 15 పనులు ప్రారంభించలేదు. సీసీ రోడ్ల నిర్మాణానికి జిల్లాకు రూ.34.24 కోట్లు మంజూరు కాగా, రూ.25 కోట్ల మేర పనులు పూర్తి చేశారు. జిల్లాలో అత్యధికంగా పినపాక నియోజకవర్గానికి 197 పనులు, ఆ తర్వాత అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాలకు 147 చొప్పున పనులు మంజూరయ్యాయి. కాగా, రోడ్ల నిర్మాణానికి ఆదివారం ఒక్క రోజే గడువు ఉండగా, పూర్తి కాని పనులకు సంబంధించిన నిధులు వెనక్కు వెళ్లిపోతాయి. దీంతో పలుచోట్ల అధికారులు ఆగమేఘాల మీద పనులు చేస్తున్నారు. అయితే హడావిడిగా చేపడుతున్న పనులతో నాణ్యత లోపిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పలు చోట్ల సిమెంటు తక్కువగా వేయడం, అక్కడక్కడ నాణ్యత లేని ఇసుకను ఉపయోగిస్తుండటం, క్యూరింగ్ సక్రమంగా చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. సీసీ రోడ్ల నిర్మాణం అనంతరం కనీసం 28 రోజుల పాటు క్యూరింగ్ చేయాల్సి ఉండగా చాలాచోట్ల వరి గడ్డి వేసి వారం రోజుల పాటు నీటి తడితో ముగిస్తున్నారని ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం ఎండలు బాగా ఉండటంతో సీసీ రోడ్లకు రోజూ క్రమం తప్పకుండా క్యూరింగ్ చేయాలి. లేకపోతే రోడ్డు నాణ్యతపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ప్రతిసారి ఈజీఎస్‌లో విజయవంతంగా చేపడుతున్న సీసీ రోడ్ల బిల్లుల కోసం కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు నెలల కొద్దీ ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఆర్థిక సంవత్సరం చివరలో మంజూరవుతున్న పనులను ఆగమేఘాల మీద చేపట్టి పూర్తి చేస్తున్నా కానీ వీరికి సకాలంలో డబ్బులు అందడం లేదు. పనుల కోసం పలువురు బయట నుంచి అప్పులు తెచ్చి మరీ సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఆ తర్వాత బిల్లుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ సారైనా అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించేలా చొరవ చూపాలని కోరుతున్నారు.

450 పనులు పూర్తి చేశాం



జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 617 సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.34.24 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీలో కేటాయించింది. ఎలాంటి జాప్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను ప్రారంభించాం. జిల్లాలో ఇప్పటివరకు 450 పనులను పూర్తి చేయగలిగాం. మరికొన్ని పనులు నేడు పూర్తవుతాయి.

– ఎస్.శ్రీనివాసరావు, పీఆర్ ఈఈ

క్లుప్తంగా

లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్‌గా మిరియాల


మిరియాల చంద్రమోహన్

ఇల్లెందు: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ (హైదరాబాద్ జిల్లా 320 హెచ్) రీజియన్ చైర్మన్‌గా ఇల్లెందుకు చెందిన మిరియాల చంద్రమోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. తాను పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు చంద్రమోహన్ తెలిపారు. నియామకం పట్ల దిండిగాల రాజేందర్, పింగళి నరేష్, పులి సైదులు, ఎస్‌కె జానీ, మావునూరి మాధవ్, కొల్లి సంజీవరెడ్డి, గుగులోతు రాంచందర్ నాయక్, శాసనాల రామయ్య, ఎస్‌డీ జానీపాషాలు హర్షం వ్యక్తం చేశారు.

పెరిక సంఘం సత్రం నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలో భద్రాద్రి జిల్లా పెరిక సంఘం ఆధ్వర్యంలో నిర్మించే సత్రానికి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భూమి పూజ చేసిన ఆయన మాట్లాడుతూ భద్రాద్రి పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల కోసం సత్రం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిప్పన సిద్దులు, ముత్తయ్య, ఉమామహేశ్వరరావు, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పికప్ వాహనానికి నిప్పు పెట్టిన మావోయిస్టులు

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధి దులేద్–ముక్రాంజ్ గ్రామాల అటవీప్రాంతంలో మావోయిస్టులు పికప్ వాహనానికి నిప్పు పెట్టిన ఘటన శనివారం చోటుచేసుకుంది. దులేద్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన వాహనానికి నిప్పంటించగా, చింతగుఫా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

రూ.7.23 లక్షలు స్వాధీనం

భద్రాచలంటౌన్: కూనవరం రోడ్డులో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద శనివారం తనిఖీలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ నుంచి నల్లగొండకు వెళ్తున్న లారీలో తనిఖీ చేయగా రూ.7,23,400 లక్షల నగదు లభించింది. ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్‌ఎస్‌టీ ఇన్‌చార్జ్ బాలకృష్ణ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లొద్దని సూచించారు. సిబ్బంది రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. ఆరుగురు ప్రొఫెసర్లు, 13మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 18మంది సీనియర్ రెసిడెంట్ల పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్న ఆన్‌లైన్‌లో లేదా నేరుగా దరఖాస్తు చేసుకుని 4వ తేదీ ఉదయం 10 గంటలకు మెడికల్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా జిల్లా సెలక్షన్ కమిటీ నేతృత్వాన అర్హులను ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కోళ్ల వ్యాన్ బోల్తా

దుమ్ముగూడెం : మండలంలోని చిన్ననల్లబల్లి గ్రామ సమీపంలో శనివారం భద్రాచలం నుంచి చర్ల వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. కాగా కొన్ని కోళ్లు మృతి చెందాయి. మరికొన్ని కోళ్లను సమీపంలో ఉన్న వ్యక్తులు పట్టుకుని ఉడాయించారు.

రథంగుట్ట అటవీ ప్రాంతంలో కార్చిచ్చు


మంటలు ఆర్పుతున్న అటవీ సిబ్బంది

మణుగూరు టౌన్: మండలంలోని రథంగుట్ట అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. ఆంజనేయ స్వామి ఆలయం అర్బన్ పార్కు సమీపంలో మంటలు దావనలంలా వ్యాపించాయి. దీంతో మణుగూరు ఫారెస్ట్ రేంజర్ ద్వాల్యా, సిబ్బంది, బేసింగ్ క్యాంపు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని బ్లోయర్ తదితర పరికరాలతో మంటలను ఆర్పివేశారు.

భూసార కేంద్రానికి తాళం

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- భూసార పరీక్షలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వ్యవసాయ శాఖ


తాళం వేసి ఉన్న భూసార పరీక్షా కేంద్రం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా కేంద్రంలో ఉన్న భూసార పరీక్షా కేంద్రాన్ని సిబ్బంది కొరత వెంటాడుతుండగా, అధికారులు తాళం వేశారు. రైతుల వ్యవసాయ భూముల్లో మట్టి నమూనాలకు పరీక్షలు నిర్వహించి భూసార ఫలితాలు వెల్లడించాల్సిన కార్యాలయంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం మార్కెట్‌యార్డులో అరకొర వసతులతో భూసార పరీక్షా కేంద్రం కొనసాగుతోంది. సౌకర్యాలు లేక భద్రాచలంలో భూసార పరీక్షా కేంద్రం నడవకపోడంతో అక్కడి వ్యవసాయాధికారిని కొత్తగూడెంలో ఎస్టీఎల్(సాయిల్ టెస్టింగ్ లేబోరేటర్)గా డిప్యూటేషన్‌పై నియమించారు. ఇటీవల భద్రాచలం భూసార పరీక్షా కేంద్రానికి నిధులు విడుదలై రైతాంగానికి సేవలందిస్తోంది. దీంతో కేంద్రానికి అవసరమైన అధికారిని కూడా నియమించారు. కానీ కొత్తగూడెం భూసార కేంద్రాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్న ఒక్క అధికారిని కూడా ఆళ్లపల్లికి డిప్యూటేషన్‌పై పంపించడంతో కేంద్రానికి తాళం పడింది.

రైతుల అసహనం..

జిల్లా కేంద్రంలోని భూసార కేంద్రానికి తాళం వేయడంతో రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రంలో ఇద్దరు ఏఓ స్థాయి ఎస్టీఎల్‌లు, ఒక ఏఈఓ, అటెండర్, వాచ్‌మెన్ ఉండాలి. గతంలో అటెండర్‌ను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించినా సకాలంలో వేతనం ఇవ్వలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్క ఎస్టీఎల్‌తోనే ప్రతి సీజన్‌లో 5 వేల వరకు వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మట్టి నమూనాలను పరీక్షించేవారు. ప్రస్తుతం ఆ ఒక్క ఎస్టీఎల్‌ను కూడా మరో ప్రాంతానికి డిప్యూటేషన్‌పై పంపించారు.

ఉన్నతాధికారులు పట్టించుకోవాలి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పంటల సమీక్షలు నిర్వహించిన సందర్భంలో భూసార కేంద్రాలకు అన్ని సౌకర్యాలు సమకూరుస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం భూసార కేంద్రాల సౌకర్యాలపై ఇంకా దృష్టి సారించడం లేదు. డిసెంబర్ 5న అంతర్జాతీయ భూసార దినోత్సవాన్ని గతంలో కొత్తగూడెం మార్కెట్‌యార్డు ఆవరణలో జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో అవగాహనా కార్యక్రమాలను వ్యవసాయ శాఖ నిర్వహించేది. ఆరేళ్లుగా ఆ ఊసే లేకుండా పోయింది. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు భూసార కేంద్రం సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి



జిల్లా కేంద్రంలోని భూసార పరీక్షా కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మించాలి. అసరమైన నిధులు కేటాయించాలి. సిబ్బందిని కేటాయించి రైతాంగానికి సేవలు అందించేలా చూడాలి.

– వాంకుడోత్ కోబల్, రైతు, రేగళ్ల

వ్యవసాయ కళాశాలను సందర్శించిన విద్యార్థులు


బొప్పాయి తోటను పరిశీలిస్తున్న విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: ప్రొఫెసర్ జయశంకర్ సార్ వ్యవసాయ కళాశాలను శనివారం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విసన్నపేటకు చెందిన ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీఎస్సీ విద్యార్థులు సందర్శించారు. కళాశాలలో సాగు చేస్తున్న పూల, పండ్ల తోటలతోపాటు, పలు రకాల పంటలను పరిశీలించారు. సాగు చేసే విధానం, పాటించే జాగ్రత్తలు, ఎరువుల వినియోగం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ అన్నదాతలు అహర్నిశలు కష్టపడి పంటలు పండిస్తేనే ప్రజలకు ఆహార ఉత్పత్తులు సమృద్ధిగా అందుతాయని అన్నారు. దేశ అభివృద్ధిలో వ్యవసాయ రంగానిదే అగ్రస్థానమని, వ్యవసాయ విద్యను ఇష్టంతో చదవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు బొప్పాయి, పుచ్చకాయ, చెరకు, వంగ, మామిడి, పూల తోటలు, తేనెటీగల పెంపకంపై కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ లక్ష్మణ్ అవగాహన కల్పించారు. వానపాములు, జీవామృతంపై శాస్త్రవేత్త డాక్టర్ పావని, కొబ్బరి, మామిడి సాగుపై శాస్త్రవేత్త డాక్టర్ శిరీష వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు కళాశాల అధ్యాపకులు దుర్గాభవాని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారుల మధ్య రగడ!

ఇద్దరి మధ్య ఫంక్షన్ హాల్ నిర్మాణ చిచ్చు

కరకగూడెం: మండల కేంద్రంలో ఓ వ్యక్తి చేపట్టిన ఫంక్షన్ హాల్ నిర్మాణంతో ఇద్దరు అధికారుల మధ్య రగడ నెలకొంది. మండల కేంద్రానికి చెందిన బూరగడ్డ రవి అనే వ్యక్తి ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టాడు. అనుమతులు లేవంటూ ఎంపీవో కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డి భవన నిర్మాణాన్ని నిలిపివేశారు. తనకు అనమతులు ఉన్నాయంటూ ఫంక్షన్ హాల్ యజమాని కోర్టులో కేసు వేశాడు. కోర్టులో కేసు నడుస్తుండగా రవి తహసీల్దార్ నాగప్రసాద్‌ను సంప్రదించినట్లు సమాచారం. ఈ క్రమంలో భవన నిర్మాణ పనులు తిరిగి కొనసాగిస్తుండగా, రవికి ఎంపీఓ కుమార్ ఫోన్ చేసి నిర్మాణానికి ఎవరు అనుమతులు ఇచ్చారంటూ రవితోపాటు తహసీల్దార్ నాగప్రసాద్‌ను దుర్భాషలాడినట్లు ఆడియో క్లిప్ శనివారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. ఈ విషయమై ఎంపీఓ కుమార్‌ను వివరణ కోరగా.. తహసీల్దార్‌ను దూషించినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తమని, ఫంక్షన్ హాల్ నిర్మాణ విషయంలో హైకోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటున్నామని తెలిపారు. తహసీల్దార్ నాగప్రసాద్‌ను వివరణ కోరగా.. ఎంపీఓ తనను దుర్భాషలాడాడని, ఈ విషయంపై ఉన్నతాధికారులే న్యాయం చేస్తారని పేర్కొన్నారు.

483 సెల్‌ఫోన్లు అప్పగింత


సెల్‌ఫోన్లు అందజేశాక బాధితులతో ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

కొత్తగూడెంటౌన్: పోగొట్టుకున్న 483 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో సెల్‌ఫోన్లు అందజేశాక ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జనవరి నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 1,674 సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఫిర్యాదులు అందాయని, అందులో 964 మొబైల్ ఫోన్లను గుర్తించామని, ఇప్పటివరకు 483 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించామని వివరించారు. ఫోన్ పోతే తక్షణమే సీఈఐఆర్ పోర్టల్‌లోఅన్ని వివరాలు కచ్చితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం సంబంధిత పోలీసుస్టేషన్ నుంచి ట్రాక్ చేసి గుర్తిస్తామని తెలిపారు. ఎక్కువ సెల్‌ఫోన్ల రికవరీకి కృషి చేసిన కొత్తగూడెం త్రీటౌన్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఐటీ సెల్ ఇన్‌చార్జ్ సీఐ నాగరాజురెడ్డి, సభ్యులు విజయ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ విందులో ఘర్షణ

వెలుగు చూసిన బాల్యవివాహం

అశ్వారావుపేటరూరల్: ఓ వివాహ విందులో చోటుచేసుకున్న ఘర్షణ కారణంగా బాల్యవివాహ వ్యవహారం శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, ఐసీడీఎస్ అధికారుల కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికకు ఈ నెల 27వ తేదీన ఓ యువకుడితో పెళ్లి జరిగింది. పెళ్లి తర్వాత శుక్రవారం వరుడి ఇంటి వద్ద రిసెప్షన్ నిర్వహించి విందు ఏర్పాటు చేశారు. కాగా విందుకు హాజరైన అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు భోజనం చేసే క్రమంలో మాంసం కూర వేయాలని వడ్డించే యువకుడిని అడిగాడు. దీంతో కూర అడిగిన యువకుడితో నిర్వాహకుడి బంధువులు గొడవకు దిగగా, పరిస్థితి దాడికి దారితీసింది. సదరు యువకుడిని కర్రలు, వాటర్ పైపులతో చితకబాదడంతో తీవ్ర గాయాలు కాగా, బాధితుడు అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా ఘర్షణ నేపథ్యంలో పెళ్లి కుమార్తె మైనర్ అని సమాచారం అందగా, ఐసీడీఎస్ అధికారులు విచారణ చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఫిర్యాదుతో ఏఎస్ఐ రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పెళ్లి వేడుక విందులో దాడికి గురై, తీవ్రంగా గాయపడిన యువకుడి ఫిర్యాదుపై మాత్రం శనివారం వరకు కేసు నమోదు కాలేదు. దీనిపై ఎస్ఐ శ్రీరాముల శ్రీను 'సాక్షి'వివరణ కోరగా.. దాడిపై ఫిర్యాదు వచ్చిందని, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు


అనాథ మృతదేహం వద్ద ట్రస్ట్ చైర్మన్, సభ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: మతిస్థిమితం లేని యాచకుడు (50) ఇటీవల మృతి చెందగా, ఆయన ఆచూకీ కోసం యత్నించినా ఎవరూ రాకపోవడంతో పోలీసుల సూచన మేరకు ఖమ్మంలోని అన్నం సేవా ట్రస్ట్ బాధ్యులు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేని యాచకుడు ఇటీవల అపస్మారక స్థితిలో ఉండగా, పోలీసులు 108లో పెనుబల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ మృతి చెందగా, కొన్నాళ్లు వేచి చూసినా ఎవరూ రాకపోవడంతో పోలీసులు అన్నం సేవా ట్రస్ట్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో చైర్మన్ అన్నం శ్రీనివాసరావు పెనుబల్లి ఆస్పత్రి నుంచి అనాథ మృతదేహాన్ని తీసుకొచ్చి ఖమ్మం బల్లేపల్లిలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఒక పోస్టు.. 71 మంది పోటీ!

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వాస్పత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో ఖాళీ గా ఉన్న ల్యాబ్ టెక్నీషి యన్ పోస్టు భర్తీకి శనివా రం రాతపరీక్ష నిర్వహించారు. ఒక పోస్టు భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా దరఖాస్తు చేసుకున్న 84 మందిలో 71మంది అభ్యర్థులు హాజరయ్యా రు. పరీక్షను పర్యవేక్షించి న డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిభ ఆధారంగా అర్హత ఉన్న వ్యక్తిని ఎంపిక చేస్తామని తెలిపారు.

బొగ్గు టిప్పర్ బోల్తా


ఓసీలో బోల్తా పడిన బొగ్గు టిప్పర్

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో బొగ్గు టిప్పర్ బోల్తా పడింది. బీటీపీఎస్‌కు బొగ్గు తరలించేందుకు ఓసీ–4లో శుక్రవారం రాత్రి టిప్పర్‌లో బొగ్గు లోడ్ చేశారు. పరిమితికి మించి లోడ్ చేయడంతో, అధికంగా ఉన్న బొగ్గును తొలగించేందుకు డ్రైవర్ వాహనం తీసుకెళ్తున్నాడు. వెనుక డోరు అన్‌లాక్ చేయకుండా బొగ్గు అన్‌లోడ్ చేస్తుండగా అదుపుతప్పి టిప్పర్ బోల్తా పడింది. కాగా డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. సింగరేణి అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టారు.

ఇల్లెందులో లారీ..

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీ వైకుంఠధామం సమీపంలో శనివారం బొగ్గు లోడ్ లారీ బోల్తా పడింది. మహారాష్ట్ర నుంచి పాల్వంచ నవభారత్‌కు బొగ్గు తరలిస్తుండగా అదుపు తప్పి ప్రమాదం జరిగింది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు. ఇల్లెందు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

వైరా సబ్ రిజిస్ట్రార్‌పై బదిలీ వేటు

వైరా: వైరా సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న కరుణను అధికారులు శనివారం బదిలీ చేశారు. ఇటీవల కొణిజర్ల, ఏన్కూరు మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా 1/70 యాక్ట్ పరిధిలోని భూములకు అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలు రావడంతో జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ విచారణ చేపట్టారు. అక్రమ రిజిస్ట్రేషన్లు నిజమేనని తేలడంతో ఆమెపై బదిలీ వేటు పడింది. కాగా, ఖమ్మం రిజిస్ట్రార్ ఆఫీసులో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కె.విజయ్‌కు వైరా సబ్ రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే, అటెండర్ కృష్ణపై కూడా పలు ఆరోపణలు రావడంతో ఆయనను సైతం బదిలీ చేసి ఖమ్మంలో పనిచేస్తున్న జానీని నియమించారు.

మద్యం సీజ్


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అధికారులు

అశ్వారావుపేటరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు శనివారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని వినాయకపురంలో రెండు బెల్ట్ షాపులు, నారంవారిగూడెంలో మరో బెల్ట్ షాపులో తనిఖీలు జరిపారు. 231 మద్యం బాటిళ్లనను సీజ్ చేశారు. పాత మామిళ్లవారిగూడెంలో ఇంకో దుకాణంలో 24 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన అక్రమ మద్యం విలువ రూ.39,450 ఉంటుందని, నలుగురిపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ ఎస్ఐ రాజేశ్వరరావు తెలిపారు.

బెల్లం పానకం ధ్వంసం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా ఎక్సైజ్ అధికా రుల ఆధ్వర్యంలో శనివారం వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడెం స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. రుద్రంపూర్ తండా, రామవరం, చుంచుపల్లి తండా, సర్వారం, కాకర్ల మొదలగు ప్రాంతాల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్, కొత్తగూడెం, పాల్వంచ స్టేషన్ టీమ్స్ సంయుక్త దాడులు చేసి ఐదు కేసులు నమోదు చే సినట్లు జిల్లా అబ్కారీ అధికారి జాన యా్య తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కరంచంద్, సీఐ జయశ్రీ, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ సాంబమూర్తి, పాల్వంచ సీఐ ప్రసాద్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బూర్గంపాడు: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెంచలపు వెంకటేశ్వర్లు(47) ఇంట్లో ట్యూబ్ లైట్ పెట్టేందుకు వైరు ఏర్పాటు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. వెంకటేశ్వర్లు మృతితో నాగినేనిప్రోలు గ్రామంలో విషాదం అలుముకుంది.

ఆన్‌లైన్‌లో లాభాల పేరిట మోసం

పాల్వంచ: ఆన్‌లైన్‌లో ఉత్పత్తులపై రివ్యూలు రాస్తే డబ్బు వస్తుందనే ప్రకటన నమ్మిన ఇద్దరు వ్యక్తులు మోసపోయారు. సూర్యాపేట జిల్లాకు చెందిన బోడ రాము ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ పాల్వంచలో ఉంటున్నాడు. ఈ నెల 14న ఆయనకు ఓ కంపెనీ ఉత్పత్తులపై రివ్యూలు చేస్తే డబ్బు సంపాదించొచ్చంటూ లింక్ వచ్చింది. దీంతో ఆ లింక్ ఓపెన్ చేయగా.. డబ్బు పెట్టుబడి పెడితే లాభాలు ఇస్తామనే ఆశ చూపడంతో విడతల వారీగా రూ.42 వేల వరకు పంపించాడు. అనంతరం డబ్బు తిరిగి రాకపోగా, మరో రూ.1.30 లక్షలు పంపాలన్న సూచన రావడంతో మోసపోయినట్లు గ్రహించిన ఆయన శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, పాల్వంచ నెహ్రూనగర్‌కు చెందిన ఓ మహిళ యాప్‌లో చేరితే డబ్బు వస్తుందనే ప్రకటనతో కొంత చెల్లించింది. మొదట రెట్టింపు డబ్బు రావడంతో నమ్మిన ఆమె రూ.5లక్షల వరకు పెట్టుబడి పంపింది. ఆ డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

క్లుప్తంగా...

సీపీఎం తొలి జాబితా విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సీపీఎం అభ్యర్థుల తొలి జాబితాను ఆ పార్టీ శనివారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 44 స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరిని, తెలంగాణ నుంచి ఒకరిని మాత్రమే ఎంపిక చేసింది. ఏపీలోని అరకు లోక్‌సభ అభ్యర్థిగా పాచిపెంట అప్పల నరస పేరును, తెలంగాణలోని భువనగిరి లోక్‌సభ అభ్యర్థిగా ఎండీ జహంగీర్ పేర్లను ఖరారు చేసింది. అత్యధికంగా పశ్చిమ బెంగాల్ నుంచి 17 మందిని, కేరళ నుంచి 15 మందిని అభ్యర్థులుగా ప్రకటించింది.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ సతీశ్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సతీశ్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌ను స్టార్ హోటల్‌గా మార్చుకోండి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కాబోతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఇప్పటికే ఆపార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు మొహం చాటేస్తున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి తలుచుకుంటే 24 గంటల్లో బీఆర్ఎస్ నుంచి ఖాళీ అవుతారని చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ భవన్‌గా ఉన్న పార్టీ ఆఫీస్‌ను మూసివేసి స్టార్ హోటల్‌గా మార్చుకోవాలని సూచించారు. రాజకీయం మానేసి బిజినెస్ చేసుకుంటే హరీశ్, కేటీఆర్‌కి మంచిదని సత్యం హితవు పలికారు. కేటీఆర్, హరీశ్‌రావు నీతిమంతుల్లా మాట్లాడుతుండటాన్ని ప్రజలు ఛీకొడుతున్నారన్నారు. కల్వకుంట్ల కుటుంబ నేతలను మించిన పవర్ బ్రోకర్లు ఇంకెవరూ లేరని, పదేళ్ల ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని ధ్వజమెత్తారు.

మూసీ సుందరీకరణకు రూ.60 వేల కోట్లు



- జోన్ల వారీగా వాణిజ్య అనుమతులతో నిధుల సమీకరణ
- ప్రతి రోజూ 1–2 టీఎంసీల నీటి విడుదలతో మూసీ శుద్ధి
- నదికి ఇరువైపులా కిలోమీటర్ మేర ఇంపాక్ట్ ఏరియా
- 10 వేలకు పైగా ఆక్రమణలే మూసీ సుందరీకరణకు అడ్డంకులు

ప్రాజెక్టు తొలి దశ అంచనా వ్యయమిలా

వెస్ట్ కారిడార్- ఈస్ట్ కారిడార్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.15,000 కోట్లు	ట్రంక్ లైన్‌కు రూ.3,000 కోట్లు
రివర్ లింకేజీకి రూ.3,000 కోట్లు	
మూసీ మొత్తం పరీవాహక ప్రాంతం: 110 చ.కి.మీ.	ఆక్రమణలున్న ప్రాంతం: 55 చ.కి.మీ.

సాక్షి, హైదరాబాద్: మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంచనా వ్యయం అక్షరాలా రూ.60 వేల కోట్లు. దశల వారీగా మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించిన సర్కారు.. నది సుందరీకరణ, నిర్వహణ కోసం నిధుల సమీకరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. 2050 మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా నది పరిసరాలను జోన్ల వారీగా విభజించి వాణిజ్య కార్యకలాపాలను అనుమతించడం ద్వారా నిధులను సమీకరించాలని భావిస్తోంది. దీనికి అనుగుణంగా మూసీ వెంట రవాణా కారిడార్లు, లాజిస్టిక్ హబ్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. నదీ గర్భం నుంచి ఇరువైపులా కిలోమీటరు మేర ఇంపాక్ట్ ఏరియాగా ప్రకటించాలని సూత్రప్రాయంగా నిర్ణయించిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టు యంత్రాంగం.. ఇప్పటికే నది హద్దులు, ఆక్రమణలపై ప్రాథమికంగా సర్వే నిర్వహించింది. ఈ సర్వే ఆధారంగా జీఐఎస్ మ్యాపింగ్‌ను చేసింది.

ఆక్రమణలే అడ్డంకి..

మూసీ రివర్ ఫ్రంట్‌ను పునరాభివృద్ధి చేయాలనే ఆలోచన తొలుత 1908లోనే వచ్చింది. 1990లో కాస్త ముందుకు కదిలినా.. పూర్తిస్థాయిలో పురోగతి సాధించలేదు. మురుగునీరు, ఆక్రమణలే మూసీ పునరుజ్జీవానికి ప్రధాన అడ్డంకులుగా నిలిచాయి. 55 కి.మీ మేర నదీ మార్గంలో ఉన్న ఆక్రమణలను తొలగించడం ప్రభుత్వానికి కష్టతరమైన పనే అని అంటున్నారు. నది పునరుజ్జీవం కావడానికి 15–20 ఏళ్ల సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆక్రమణలు సుమారు 2వేల మేర ఉంటాయని అంచనా వేసిన యంత్రాంగం.. వీటిని తొలగించేందుకు ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేనప్పటికీ, కొన్నిచోట్ల పట్టా భూముల్లో వెలిసిన నిర్మాణాల విషయంలో మాత్రం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. ఇలాంటి కట్టడాలు 10వేల వరకు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించింది. భూ సేకరణ చట్టం కింద వీరికి పరిహారం చెల్లించడమా? ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించడమా? ఇతర మార్గాలేమిటనే కోణంలో అధ్యయనం చేస్తోంది. పాతబస్తీలో మూసీ కుచించుపోయిందున ఇక్కడ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించే ఆలోచన కూడా చేస్తోంది.

జంట జలాశయాల నుంచి రోజూ నీరు

గుజరాత్‌లో నర్మదా నది నీటిని సబర్మతికి తీసుకెళ్లిన మాదిరే గోదావరిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు అనుసంధానం చేయాలనేది ప్రణాళిక. మురుగునీటితో నిండి ఉన్న మూసీ నదికి ఈ జంట జలాశయాల నుంచి నీటిని విడుదల చేస్తారు. ఇలా రోజుకు 1–2 టీఎంసీల జలాల విడుదలతో మురుగు శుద్ధి జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. వరద నీరు, మురుగు నీరు కూడా నదిలో కలుస్తున్నందున మూసీ కలుషితం అవుతుందని తేలడంతో అమృత్ పథకం కింద 39 మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ (ఎస్టీపీ)లను నిర్మిస్తోంది. వీటిద్వారా వందశాతం శుద్ధి చేసిన నీటిని నదిలోకి విడుదల చేస్తారు. వీటికి అనుబంధంగా ప్రతి రోజు జంట జలాశయాల నుంచి నీటిని వదలడం ద్వారా నదీలో స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా.. సందర్శకులను ఆకర్షించేలా రూపొందిస్తారు. మార్గమధ్యంలో పార్కులు, బోటింగ్ కూడా ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

సబర్మతి.. మూసీ

కృష్ణా నదికి ఉపనది అయిన మూసీ వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండలో పుట్టి.. నార్సింగి ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి గౌరెల్లి ఓఆర్ఆర్ వరకు 55 కి.మీ. మేర ప్రవహిస్తుంది. దేశంలోనే నది పునరాభివృద్ధి ప్రాజెక్ట్‌ల్లో మూసీ రివర్ ఫ్రంట్ అత్యంత ప్రతిష్టాత్మకం. నీటి నిర్వహణ, ప్రణాళిక, రవాణా, పునరావాసం, పట్టణ పునరుజ్జీవం తదితరాల కోసం రూ.60 వేల కోట్ల వ్యయం, సుమారు 36 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గుజరాత్‌లోని సబర్మతి నది పునరాభివృద్ధికి మూసీకి దగ్గరి పోలికలున్నాయి, కాకపోతే సబర్మతి అహ్మదాబాద్ నగరంలో 11 కి.మీ. మేర మాత్రమే విస్తరించి ఉండగా.. మూసీ నది హైదరాబాద్‌లో 55 కి.మీ. మేర ప్రవహిస్తుంది. అదీగాక సబర్మతి కంటే మూసీ పరీవాహక ప్రాంతాలు ఎక్కువ ఆక్రమణకు గురవడంతోపాటు జనసాంద్రత కలిగిన ప్రాంతాలు కావడం గమనార్హం.

హైవేపై పెరిగిన టోల్‌ఫీజు

నేటి అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్న ధరలు

కేతేపల్లి: హైదరాబాద్–విజయవాడ 65 నంబరు జాతీయ రహదారిపై టోల్‌గేట్ల వద్ద వాహనదారుల నుంచి వసూలు చేస్తున్న టోల్ ఫీజును రహదారి విస్తరణ కాంట్రాక్టు సంస్థ జీఎమ్మార్ యాజమాన్యం పెంచింది. ఒక్కో వాహనానికి ఒక వైపు, ఇరువైపులా కలిపి రూ. 5నుంచి రూ. 40 వరకు, స్థానికుల నెలవారీ పాస్‌ను రూ.330 నుంచి రూ.340 కి పెంచింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండల ఆంథోల్ మైసమ్మ దేవాలయం నుంచి ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వరకు గల 181.5 కి.మీ మేర రెండులేన్లుగా ఉన్న రహదారిని దాదాపు రూ.2000 కోట్ల వ్యయంతో 2012లో బీవోటీ పద్ధతిన జీఎమ్మార్ సంస్థ నాలుగు లేన్లుగా విస్తరించింది. ఈ విస్తరణ పనులకు అయిన వ్యయాన్ని రాబట్టుకునేందుకు 65 నంబరు జాతీయ రహదారిపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వద్ద ఒకొక్కటి చొప్పున మూడు టోల్‌ప్లాజాలను జీఎమ్మార్ సంస్థ ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 2012 నుంచి టోల్‌ఫీజు వసూళ్లను కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది. ఎన్‌హెచ్ఏఐ సూచించిన నిబంధనల మేరకు వార్షిక సవరణల పేరిట ఏడాదికి ఒకమారు వాహనాల నుంచి వసూలు చేస్తున్న టోల్‌ఫీజు ధరలను పెంచుకునే వెసులుబాటు జీఎమ్మార్ సంస్థకు ఎన్‌హెచ్ఏఐ కల్పించింది. అయా టోల్‌ప్లాజాల వద్ద ఈనెల 31(ఆదివారం) అర్ధరాత్రి 12 గంటల తర్వాత అంటే ఏప్రిల్ 1 నుంచి పెంచిన టోల్ ధరలు అమల్లోకి రానున్నాయి. ఏడాది కాలం పాటు ఇవే ధరలు అమల్లో ఉంటాయి.

పెరిగిన టోల్‌ఫీజులు ఇలా..

వాహనం	పంతంగి టోల్‌ప్లాజావద్ద		కొర్లపహాడ్ వద్ద	
	ఒకవైపు	ఇరువైపులా	ఒక వైపు	ఇరువైపులా
కారు,జీపు,వ్యాను (లైట్ మోటార్ వెహికల్)	95	145	130	195
లైట్‌కమర్షియల్,గూడ్స్	150	230	205	310
మినీ బస్సు బస్సు, ట్రక్కు (2యాక్సిళ్లు)	315	470	430	640
భారీ వాహనాలు (3 నుండి 6 యాక్సిళ్లు)	485	725	665	995
అతి భారీ వాహనాలు (7 అంతకంటే ఎక్కువ యాక్సిళ్లు)	605	910	825	1240



మూలమూర్తుల ఫొటోలు బయటకు..

- భద్రాచలంలో మాజీ ఎంపీ దర్శనం సందర్భంగా ఫొటోలు తీసిన ఓ వ్యక్తి
- ఆపై సోషల్ మీడియాలో వైరల్



ఆలయంలో ధ్వజస్తంభం వద్ద మాజీ ఎంపీ సీతారాంనాయక్, అనుచరులు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో పూజలు చేస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం వివాదాస్పదంగా మారింది. మాజీ ఎంపీ, మహబూబాబాద్ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్ శనివారం భద్రాచలంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన వెండి వాకిలి వద్ద నుంచే స్వామిని దర్శించుకుంటుండగా.. వెంట వచ్చిన ఓ వ్యక్తి ఫొటోలు తీశాడు. ఈ ఫొటోలో సీతారాంనాయక్‌తో పాటు అంతరాలయంలో మూలమూర్తులు, అర్చకులు పూజలు చేస్తుండటం కనిపించగా.. బీజేపీ నేతలు మీడియాకు ఈ ఫొటోలనే విడుదల చేశారు. అంతరాలయంతో పాటు ఉపాలయాల్లోని మూలవరుల ఫొటోలు సైతం బయటకు రాగా.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అంతరాలయంతో పాటు ఉపాలయాల్లో ఫొటోలు తీయడంపై నిషేధం ఉండగా.. సాధారణ భక్తులెవరినీ సెల్‌ఫోన్లు, కెమెరాలతో ఆలయ ఆవరణలోకి అనుమతించరు. కానీ సీతారాంనాయక్ వెంట ఉన్న వ్యక్తుల విషయంలో అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఆలయ ఈఓ రమాదేవిని వివరణ కోరగా, అంతరాలయం, ఉపాలయాల్లో ఎవరు ఫొటోలు తీశారో గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ సీతారాంనాయక్ వెంట ఉన్న వ్యక్తులే ఇందుకు కారణమని ప్రాథమిక విచారణలో తేలిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులకు అందజేస్తామని తెలిపారు.

జిల్లా వార్తలు

బొగ్గు ఉత్పత్తి లక్ష్యం.. 90 మిలియన్ టన్నులు

- వచ్చే ఐదేళ్లలో చేరుకునేలా ప్రణాళిక
- ఈ ఏడాది కొత్తగా మూడు ఓసీల్లో ఉత్పత్తి
- కొత్త గనులు మొదలైతే సంస్థ మనుగడకు భరోసా



ఓసీ అనుమతుల కోసం ఎదురు చూస్తున్న వీకే-7 గని

సింగరేణి(కొత్తగూడెం): రానున్న ఐదేళ్లలో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్యం 90 మిలియన్ టన్నులకు చేర్చేలా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. కొత్తగూడెం ఏరియాలోని వీకే–7 ఓసీతో పాటు ఇల్లెందులోని జేకేఓసీ, ఒడిశాలోని నైనీ ఓసీలకు అనుమతి లభించి రానున్న ఏడాది (2024–25) కంపెనీ నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలనే వ్యూహాల్లో నిమగ్నమయ్యారు. ఇందులో కొత్తగూడెం రీజియన్‌లోని జేకే ఓసీ, వీకేఓసీల ద్వారా ఐదేసి మిలియన్ టన్నులే కాక నైనీలో 10 మిలియన్ టన్నులు సాధించాలని ఇప్పటికే నిర్ణయించారు. ఇక భవిష్యత్ లక్ష్యాలపై కూడా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు ప్రస్తుతం 70 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని రానున్న ఐదేళ్లలో 90 మిలియన్ టన్నులకు చేర్చేలా సీఎండీ, డైరెక్టర్లు సమాలోచనలు చేస్తున్నారు.

పెంపు ఇలా..

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26)లో గొల్లేటి ఓసీ, రామగుండం రీజియన్‌లోని జీడీకే–10 ఓసీ (మెగా ఓసీ) ద్వారా మరో 5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అలాగే, 2026–27 ఆర్థిక సంవత్సరంలో భూపాలపల్లి ఏరియాలోని ఎంవీకే–ఓసీ, రామకృష్ణాపురం ఓసీ(ఆర్‌కేపీ ఓసీ), ఆర్కే–5 అండ్ ఆర్కే6–ఓసీల ద్వారా రెండేసి మిలియన్ టన్నులతో పాటు బెల్లంపల్లి ఏరియాలోని పీవీఎన్ఆర్–ఓసీ ద్వారా 5 మిలియన్ టన్నుల ఉత్పత్తి నమోదు చేయాలనేది లక్ష్యం. తద్వారా 2028–29 ఆర్థిక సంవత్సరం లక్ష్యంలో 20 మిలియన్ టన్నులు పెరిగి ప్రస్తుతం సాధిస్తున్న 70 మిలియన్ టన్నులతో కలుపుకుని 90 మిలియన్ టన్నులకు చేరుకుంటారు.

మరో 40 ఏళ్లు పెరగనున్న మనుగడ

సింగరేణి సంస్థ సుమారు 134 ఏళ్ల కిందట బొగ్గు ఉత్పత్తి ప్రారంభించింది. 1889లో ఇల్లెందు సమీపాన బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు సర్ విలియమ్ కింగ్ గుర్తించగా.. ఆ తర్వాత మిగతా ఐదు జిల్లాల్లో చేసిన సర్వే ద్వారా 11,395 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను గుర్తించారు. అయితే, ఈ 134 ఏళ్ల కాలంలో సుమారు 2 వేల వేల మిలియన్ టన్నుల బొగ్గు మాత్రమే వెలికి తీయగలిగారు. తాజాగా సింగరేణి సంస్థ ఎక్స్‌ప్లోరేషన్ విభాగం గుర్తించిన నిక్షేపాలతో కంపెనీకి మరో 40 ఏండ్ల మనుగడ ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే సంస్థ ఉత్పత్తి చేసిన బొగ్గు ద్వారా సుమారు 2 వేల పరిశ్రమల్లో దాదాపు 20 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. అలాగే, థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తితో కార్మికుల ఉపాధికి ఢోకా లేకపోగా.. కొత్త గనులు మొదలైతే ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు.

త్వరలో మొదలుకానున్న గనులు, ఉత్పత్తి, జీవితకాలం (అంచనా)

ఏరియా	గని	వార్షిక ఉత్పత్తి (మి.టన్నుల్లో)	జీవితకాలం (ఏళ్లు)
కొత్తగూడెం	వీకే-7 ఓసీ	5	40
ఇల్లెందు	జేకే-ఓసీ	2	20
బెల్లంపల్లి	గొల్లేటి ఓసీ	3	15
గోదావరిఖని	జీడీకే-ఓసీ	5	20
బెల్లంపల్లి	ఎంవీకే ఓసీ	1.70	10
భూపాలపల్లి	కేటీకే ఓసీ	3	20
భూపాలపల్లి	పీవీఎన్ఆర్ ఓసీ	2	10
శ్రీరాంపూర్	రామకృష్ణాపూర్ ఓసీ	1.5	10
శ్రీరాంపూర్	ఆర్‌కే-5, 6 ఓసీలు	1	15

ఇవేకాక కాకుండా మణుగూరులోని పీకేఓసీ ద్వారా ఏటా 9.75 మిలియన్ టన్నుల చొప్పున 20 ఏళ్లు, సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలో మరో 10 మిలియన్ టన్నులు, రొంపేడు ఓసీలో ఏటా 6 మిలియన్ టన్నుల ఉత్పత్తికి ప్రణాళికలు ఉన్నా ఎప్పుడు అందుబాటులోకి వస్తాయనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. కొత్తగూడెం ఏరియాలోని వీకే–7 ఓసీకి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయి సుమారు రెండేళ్లు దాటినా మొదటి దశ అనుమతులు రానందున కొత్త ప్రాజెక్టులపై అధికారులు అంచనాకు రాలేకపోతున్నారు.

నూతన గనుల అనుమతిపై ప్రత్యేక దృష్టి



కొత్త గనుల అనుమతి కోసం కేంద్ర బొగ్గుశాఖ కార్యదర్శి ప్రహ్లాద్ జోషిని కలిశాం. భూగర్భ గనులు, ఓసీలకు అనుమతి త్వరగా ఇప్పించాలని కోరాం. ఈ ఏడాది లక్ష్యసాధనకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. ఈ స్ఫూర్తితో వచ్చేఏడాది 72 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధిద్దాం.

–ఎన్.బలరామ్, సింగరేణి సీఎండీ

వీకే–7 ఓసీకి అనుమతితో పూర్వవైభవం



కొత్తగూడెం ఏరియాలో తాజాగా జీకేఓసీ, వీకే–7 షాఫ్ట్, పీవీకే–5 షాఫ్ట్ గనులు మూతపడి కార్మికులు లేక కాలనీలకు కళ తప్పింది. సంస్థ సీఎండీ, డైరెక్టర్లు కొత్త గనుల అనుమతి కోసం కృషిచేస్తున్నారు. వీకే–7 ఓసీకి అనుమతి వస్తే పూర్వవైభవం సంతరించుకుంటుంది.

–శాలేంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించండి..

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు

దుమ్ముగూడెం: అధికార పార్టీలతో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రజలను మళ్లీ మోసం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నందున లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం దుమ్ముగూడెం మండలంలోని రేగుబల్లి, తూరుబాక గ్రామాల ప్రధాన రహదారిపై కరపత్రాలను వదిలారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలన్నీ రూ.వేల కోట్ల నగదు, మద్యం పంపిణీ చేశాయని.. ఇప్పుడూ అదే తరహాలో అధికారం చేపట్టడానికి ధనబలం, కండబలమే కాక కులం, మతం పేర్లతో వస్తున్నాయని అందులో పేర్కొన్నారు. దళారీ, నిరంకుశ, పెట్టుబడిదారీ, భూస్వామ్య, పాలకవర్గ ముఠాలు కుల, మతతత్వ, ప్రాంతీయ రాజకీయాలతో భ్రష్టు పట్టిస్తూ పార్లమెంట్ వ్యవస్థను అపహాస్యం చేయడానికి పార్టీలు సిద్ధమవుతున్నాయని పార్టీ పేర్కొంది. 2019 లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీ కుట్రపూరితంగా పుల్వామా ఘటనను సృష్టించి హిందూ మతోన్మాదం, జాతీయోన్మాదం, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి ఓట్లు దండుకుందని ఆరోపించారు. ఇప్పుడు ఆర్ఎస్ఎస్, బీజేపీ అయోధ్యలో రెండు మతాల ప్రజల మధ్య చిచ్చు రేపి రామమందిరాన్ని రూ.2వేల కోట్లతో నిర్మించి రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వ లాంఛనాలతో ప్రారంభించిందని విమర్శించారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత



మెడికల్ కళాశాలలో మృతదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబీకులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం జిల్లా మధిరకు చెందిన టీవీ, సినీ నటుడు దూదిపాళ్ల వీరభద్రం(72) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన జీవించి ఉన్నప్పుడే మరణానంతరం నేత్రదానం చేయాలని కోరడమే కాక మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించేలా పత్రాలు అందజేశారు. దీంతో వీరభద్రం కుటుంబ సభ్యులు శనివారం ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఆయన మృతదేహాన్ని అప్పగించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు జ్యోతి, అశోక్‌కుమార్, తెలంగాణ నేత్ర, అవయవ శరీరదాతల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవరపు నాగేశ్వరరావు, అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావుతో పాటు ఎం.అశోక్, పి.కృష్ణప్రసాద్, ఆర్.వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డీసీపీ ఆర్.శ్రీనివాసరావు, ఆర్.సీతారామారావు, డాక్టర్ ఎం.వీ.రమణ, శ్రీనివాస్, కృష్ణప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

ఎనిమిది యూనిట్లలో అమ్ముడుపోని తునికాకు



పాల్వంచరూరల్: ఈ ఏడాది తునికాకు సేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ నాలుగు సార్లు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు నిర్వహించినా ఎనిమిది యూనిట్లు మిగిలిపోయాయి. ఖమ్మం జిల్లాలోని ఐదు, భద్రాద్రి జిల్లాలో మూడు యూనిట్లు దక్కించుకునేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపలేదు. ఈనెల 15నుంచి 19వ వరకు చివరి దశ టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకురాలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో మొత్తం 31 యూనిట్లకు గాను 28 యూనిట్లను కాంట్రాక్టర్లు దక్కించుకోగా.. పాల్వంచ డివిజన్‌లో ఒకటి, కొత్తగూడెం డివిజన్‌లో రెండు యూనిట్లు మిగిలాయి. ఇక ఖమ్మం జిల్లా ఖమ్మం డివిజన్‌లోని రెండు, సత్తుపల్లి డివిజన్‌లో మూడు యూనిట్లపై ఎవరూ ఆసక్తి చూపలేదు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది యూనిట్లలో ఈ ఏడాది తునికాకు సేకరణ జరిగే అవకాశం లేక.. అటు కూలీలు, ఇటు అటవీ శాఖ ఆదాయం కోల్పోనుంది.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

కామేపల్లి: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం బోల్తా పడిన ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన దంపతులు సి.ప్రసాద్, అరుణ శనివారం కామేపల్లి మండలం కొత్తలింగాల నుంచి డోర్నకల్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో పాన్నేకల్ స్టేజీ వద్ద బైక్ అదుపుతప్పి కింద పడగా ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో డోర్నకల్ ఆస్పత్రికి తరలించారు.

ఆల్ ఇండియా టోర్నీలో జెన్‌కో క్రీడాకారుల సత్తా



టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు

పాల్వంచ: హరియాణా రాష్ట్రంలో జరుగుతున్న ఆల్ ఇండియా స్థాయి టోర్నీలో టీఎస్ జెన్‌కో క్రీడాకారులు దూసుకెళ్తున్నారు. ఉత్తరాఖాండ్, గుజరాత్, హరియాణా, రాజస్తాన్ తదితర రాష్ట్రాల జట్లతో తలపడిన జెన్‌కో క్రీడాకారులు బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్‌లో ఫైనల్స్‌కు చేరారు. జెన్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్ నేతృత్వాన పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్ నుండి వై.వెంకట్, ఆరిఫ్, సతీశ్, సాల్మన్, జి.వెంకట్, సతీశ్, వి.ప్రకాశ్ పోటీలకు హాజరయ్యారు.

కోయగూడెం ఓసీని సందర్శించిన డైరెక్టర్

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం ఓసీని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పని స్థలాలను పరిశీలించి రోజువారీ బొగ్గు ఉత్పత్త, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులపై ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్‌తో చర్చించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటూ బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచాలని సూచించారు. ఇదే సమయాన ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షించాలని, ఎండ తీవ్రత నుంచి నుంచి ఉద్యోగులకు రక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు కే.వీ.రావు, నరసింహరాజు, సౌరభ్ సుమన్, శివ, శంకర్, రాజు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మొక్కలకు రక్షణ పక్కా!



జీడి మామిడి మొక్కలకు రక్షణగా కట్టిన చీరలు



వ్యవసాయ క్షేత్రాల్లో మొక్కలను మూగజీవాలతో పాటు ఎండ నుంచి కాపాడుకునేందుకు రైతులు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా అశ్వారావుపేట మండలం ఖమ్మంపాడు – నారాయణపురం రహదారిలో ఓ రైతు తన పొలంలోని జీడిమామిడి మొక్కలకు రక్షణగా పాత చీరలను కట్టాడు. మొక్కల వారీగా కట్టిన రంగురంగుల చీరలను రహదారిపై వెళున్న వారు ఆసక్తిగా చూస్తున్నారు.

– అశ్వారావుపేటరూరల్